
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

బుధవారం 28 ఫిబ్రవరి 2024

జిల్లా వార్తలు

నేడు సీఎం జగన్ విశాఖ రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ రానున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం పెదఅమిరం నుంచి మధ్యాహ్నం 4.25 గంటలకు హెలికాప్టర్‌లో ఆర్కే బీచ్‌రోడ్డులోని నేవల్ కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అక్కడి నుంచి ఏయూ కన్వెన్షన్ హాల్‌లో జరిగే డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు కుమారుడి వివాహానికి హాజరవుతారు. అనంతరం నేవల్ కోస్టల్ బ్యాటరీకి వెళ్లి హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు వెళతారు. 5.20 గంటలకు విమానంలో విజయవాడ వెళ్లిపోతారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా 27 కేంద్రాలు

- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు
- జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి పి.అప్పలరాము



మాట్లాడుతున్న అప్పలరాము

సీలేరు, ఫిబ్రవరి 27: వచ్చే నెల 1 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్ విద్యాశాఖా ధికారి పి.అప్పలరాము తెలిపారు. మంగళవారం సీలేరు జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేయడానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పాడేరు డివిజన్‌లో 17, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 10 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 15,221 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని జిల్లా కేంద్రానికి, కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షణకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కేంద్రం 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో కొత్తగా అనంతగిరి, డుంబ్రిగుడలో రెండు కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వచ్చే ఏడాది సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెండు సైన్సు గ్రూప్‌లు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సాయిరామ్ తదితరులు ఉన్నారు.

నేడు మన్యంలో నిజం గెలవాలి

అరకులోయ, పాడేరు, జి.మాడుగులలో పర్యటించనున్న నారా భువనేశ్వరి

- మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- పాడేరు మండలం ఆడారిమెట్టలో టీడీపీ క్యాడర్‌తో సమావేశం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం ఏజెన్సీలో 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నేపథ్యంలో మృతి చెందిన కుటుంబాలను ఆమె పరామర్శించడంతో పాటు పాడేరు మండలం ఆడారి మెట్ట ప్రాంతంలో టీడీపీ క్యాడర్‌తో ఆమె సమావేశం కానున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అరకులోయలో నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, పాడేరు, జి.మాడుగులలో నియోజకవర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

పార్వతీపురం మన్యం నుంచి మంగళవారం రాత్రి 7.30 గంటలకు నారా భువనేశ్వరి అరకులోయ చేరుకుని అక్కడ బస చేశారు. బుధవారం ఉదయం అరకులోయ మండలం మాదల పంచాయతీ ముసిరిగుడ గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త సొనాయి బసు కుటుంబాన్ని ఆమె పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందజేస్తారు. అనంతరం పాడేరు బయలుదేరి మార్గమధ్యంలో హుకుంపేట మండలం బర్మన్‌గూడ వద్ద ఆమె మధ్యాహ్న భోజనం చేస్తారు. తరువాత పాడేరు మండలం ఆడారిమెట్ట చేరుకుని అక్కడ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో ఆమె సమావేశమవుతారు. అనంతరం జి.మాడుగుల వెళ్లి అక్కడ మృతి చెందిన టీడీపీ కార్యకర్తలు కోరాబు లక్ష్మణరావు, అనసూరి రాజారావు కుటుంబాలను పరామర్శించి, వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తారు. అక్కడి నుంచి పాడేరుకు తిరుగు ప్రయాణమై స్థానిక పాత బస్టాండ్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం పాడేరు మండలం కిండంగి గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ఓంద్రు నాగేశ్వరరావు ... మిగతా 8వ పేజీలో



పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామంలో ఏర్పాటు చేస్తున్న చలువ పందిరి

అరకులోయలో భువనేశ్వరికి ఘన స్వాగతం



అరకులోయకు మంగళవారం రాత్రి చేరుకున్న భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న దొన్నుదొర, తదితరులు

అరకులోయ, ఫిబ్రవరి 27: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి మంగళవారం పార్వతీపురం మన్యం పర్యటన ముగించుకుని రాత్రి 7.30 గంటలకు అరకులోయ చేరుకున్నారు. ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దొన్నుదొర దంపతులు పుష్పగుచ్ఛం అందజేశారు. అరకులోయ ప్రధాన రహదారి పక్కన ఆరాధ్య రిసార్టు- జ్యోతిమహల్ మధ్య ఉన్న ఖాళీ స్థలంలో కార్వాన్ బస్సును సిద్ధం చేసి భువనేశ్వరి అక్కడ బస చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అరకులోయ, డుంబ్రిగుడ మండల పార్టీ అధ్యక్షులు శెట్టి బాబూరావు, సుబ్బారావు, రెండు మండలాలకు చెందిన సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. బుధవారం ఉదయం అరకులోయ మండలం మాదల పంచాయతీ ముసిరిగుడ గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త సొనాయి బసు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందాలి

కేజీహెచ్ ట్రైబల్ సెల్ అధికారులకు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



కేజీహెచ్‌లో చికిత్సలు పొందుతున్న గిరి బాలుడ్ని పరామర్శిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు/కొయ్యూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. కేజీహెచ్‌లోని ట్రైబల్ సెల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న గిరిజనులను, విద్యార్థులను పరామర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజనులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైద్య పరీక్షల నిర్వహణకు, అవసరమైన మందులు సరఫరా చేయడానికి ఐటీడీఏ నుంచి కేజీహెచ్‌కు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. ట్రైబల్ సెల్‌కు ఇప్పటికే ఒక అంబులెన్సు ఉండగా, మరో అంబులెన్సును కేటాయించామన్నారు. ఏజెన్సీలో వివిధ ఆరోగ్య సమస్యలతో వున్న 268 మంది విద్యార్థులను కేజీహెచ్‌కు రిఫర్ చేసినట్టు చెప్పారు. వారిలో 247 మంది పూర్తిగా కోలుకోగా, 13 మంది వైద్య సేవలు పొందుతున్నారని, దురదృష్టవశాత్తూ వైద్య సేవలు పొందుతూ 8 మంది విద్యార్థులు మృతి చెందారన్నారు. ముగ్గురు పిల్లలను ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపట్టామ న్నారు. ట్రైబల్ సెల్ వైద్యుడు సంపత్ నిరంతరం అందుబాటులో ఉంటూ గిరిజనులకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. అలాగే చిన్న పిల్లలకు అవసరమైన ఆపరేషన్లు చేయడానికి తిరుపతి పద్మావతి ఆస్పత్రి అధికారులతో చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, ట్రైబల్ సెల్ వైద్యాధికారి డాక్టర్ సంపత్, కేజీహెచ్ వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కేజీహెచ్‌లో వైద్యులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సత్కరిస్తున్న బీజేపీ సానుభూతిపరులు

ఏపీలో పెరిగిన బీజేపీ ఓటు బ్యాంకు

- ఏదో ఒకరోజు తప్పకుండా అధికారంలోకి వస్తాం
- కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఓటు బ్యాంకు పెరిగిందని, తప్పకుండా ఏదో ఒకరోజు ఇక్కడ కూడా అధికారంలోకి వస్తామని ఆ పార్టీ నాయకులు, కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో పలు వర్గాలతో మంగళవారం బీజేపీ నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. -వివరాలు మెయిన్ ఎడిషన్‌లో

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించండి

అధికారులకు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్ ఆదేశాలు



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జేసీ భావన విశిష్ట్, పక్కన ఎస్‌డీసీ అంబేడ్కర్


పాడేరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాలకు విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు వంటి కనీస వసతులను సమకూర్చాలని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్ ఆదేశించారు. పాడేరు నియోజక వర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, సెక్టర్ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై కచ్చితమైన సమాచారం అందించాలన్నారు. అలాగే సెక్టార్ అధికారులు పోలింగ్ సిబ్బంది రవాణాకు అవసరమైన బస్సులు, జీపులకు ప్రతిపాదనలు ఇచ్చారని, ఆయా రూట్లలో బస్సులు, జీపులు వెళ్లడానికి అనుకూలంగా ఉన్నది?, లేనిది పరిశీలించాలని ఆమె సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోని అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన వెలుతురు ఉండేలా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ప్రస్తుతం మరుగుదొడ్లు లేకపోతే కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రూ.20 వేల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. పోలింగ్ కేంద్రాల పైకప్పులు సక్రమంగా లేకపోతే మరమ్మతులు చేయడానికి నిధులు ఇస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలు గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రెండు వందల మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల కార్యాలయాలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, పాడేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన తహసీల్దార్లు, సెక్టర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్

- తొలిరోజు 86.8 శాతం హాజరు -8లో

5 నుంచి విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

- ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ శ్రీధర్



పొల్లూరు జల విద్యుత్ కేంద్రం (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

సీలేరు, ఫిబ్రవరి 27: సీలేరు కాంప్లెక్సులో వచ్చే నెల 5వ తేదీ నుంచి విద్యుత్ ఉత్పత్తిని పునఃప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నామని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ ఉత్పత్తికి అంత రాయం లేకుండా, గోదావరి డెల్టాకు రబీ పంటలకు నీటి విడుదల నేపథ్యంలో సీలేరు కాంప్లెక్సులో ఈ నెల 10 నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిన విషయం తెలిసిందేనన్నారు. అయితే ప్రస్తుతం పోలవరంలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారుల విన్నపం మేరకు సీలేరు కాంప్లెక్సులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయని ఆయన తెలిపారు. ఈ మేరకు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం బలిమెలలో ఏపీ వాటా గా 19.15 టీఎంసీలు, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో 13.40 టీఎంసీల నీటి నిల్వలతో మొత్తం 32.55 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నీటితోనే రాబోయే మూడు నెలలు (వేసవిలో) నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ కాంప్లెక్సు పరిధిలోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.



చింతపల్లిలో మంచు

పెరుగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు



పాడేరు- జి.మాడుగుల మార్గంలో మంగళవారం ఉదయం పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. పాడేరులో మంగళవారం ఒక మోస్తరుగా ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు కమ్ముకున్నది. జి.మాడుగులలో 12.1, డుంబ్రిగుడలో 14.7, అరకులోయ, అనంతగిరిలో 14.9, పాడేరులో 15, హుకుంపేట, పెదబయలులో 15.1, ముంచంగిపుట్టులో 15.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదయ్యాయి. దీంతో మన్యం లో కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం తొ మ్మిది గంటల వరకు ఒక మోస్తరుగా పొగ మంచు కురిసింది. అలాగే పగటి పూట ఎండ ప్రభావం కాస్త పెరిగింది.

చింతపల్లిలో..

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో మంచు ఉధృతి మళ్లీ పెరిగింది. మంగళవారం చింతపల్లిలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. దీంతో రాత్రి వేళ చలి తీవ్రత అధికంగా వున్నది. ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ శ్రీనివాస్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27: జాతీయ రహదారిపై కొత్తూరు జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి ఆగి వున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ పి.ఫైడపునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు శ్రీనివాస్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పెందుర్తి నుంచి కన్నూరుపాలేనికి ఖాళీ లారీతో వస్తుండగా కొత్తూరు జంక్షన్ వద్ద ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో లారీ క్యాబిన్‌లో చిక్కుకుపోయిన శ్రీనివాస్ కుడికాలు తెగిపోయింది. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తమ్ముడు గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

కోడి పందేలపై పోలీసులు దాడి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27: పట్టణానికి సమీపంలోని సుబ్రహ్మణ్యం కాలనీలో మంగళవారం మధ్యాహ్నం కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రూ.1,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 27: మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల బంగార్రాజు మంగళవారం రాత్రి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తొమ్మిది క్వార్టర్ బాటిళ్లను ఇంటికి తీసుకువెళుతుండగా దారిలో ఎస్ఐ మల్లేశ్వరరావు అడ్డగించి సోదా చేశారు. అతని నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

1900 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

- వాలాబు, రైవాడ జలాశయ పరిసరాల్లో విస్తృత తనిఖీలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 27: నాటు సారా స్థావరాలపై పోలీసులు మంగళవారం విస్తృత స్థాయిలో దాడులు చేశారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు వాలాబు గిరిజన గ్రామంలో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. వాలాబు పంచాయతీ పూలగరువులో 300 లీటర్లు, రైవాడ జలాశయం గేటు ఆనుకొని జీనబాడు గ్రామ పరిసరాల్లో 1600 లీటర్ల బెల్లం పులుసు ఉన్నట్టు గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాలాబు గిరిజనులతో సమావేశం నిర్వహించి సారా తయారీ, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కె.కోటపాడు సీఐ స్వామినాయుడు, చోడవరం సీఐ శ్రీనివాసరావు, కొత్తకోట సీఐ అప్పలనాయుడు, దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్ర, వీఆర్వో దొర, పోడెల బుజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖలో యువతి కిడ్నాప్‌నకు యత్నం

- ఒంటరిగా ఆటో ఎక్కిన యువతిని అపహరించేందుకు డ్రైవర్ యత్నం
- భయంతో ఆటో నుంచి దూకేసిన యువతి
- విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఒక యువతిని కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశాడో ఆటో డ్రైవర్. తాను దిగాల్సిన చోట ఆపకుండా డ్రైవర్ ముందుకు తీసుకువెళ్లిపోతుండడంతో ఆందోళనకు గురై ఆమె ఆటో నుంచి కిందకు దూకేసింది. స్వల్పగాయాలైన యువతిని ఆమె స్నేహితులు విమ్స్‌లో చేర్పించారు. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మద్దిలపాలెం సమీపంలోని క్రాంతినగర్‌కు చెందిన కొల్లూరు లహరి (26) సంగం-శరత్ సమీపంలోని ఒక ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో పనిచేస్తోంది. సోమవారం విధులకు వెళ్లిన లహరి మధ్యాహ్న సమయంలో షోరూమ్ నుంచి ఆరిలోవలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. కొత్త మోడల్ వాహనాన్ని లాంచింగ్ చేయాల్సి ఉన్నందున వేగంగా షోరూమ్‌కు రావాలంటూ లహరికి సిబ్బంది ఫోన్ చేశారు. దీంతో సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆమె ఆరిలోవ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. అక్కడకు షోరూమ్ ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. అయితే షోరూమ్ సిబ్బంది చెప్పిన సమయం దాటిపోతుండడంతో అక్కడ నుంచి మరో ఆటో ఎక్కింది. డ్రైవర్ ఆటోలోని అద్దం నుంచి తదేకంగా వెనుక సీట్లో కూర్చున్న లహరిని చూడడం, నవ్వుతూ మాటలు కలపడంతో అతని వ్యవహారశైలిపై ఆమెకు అనుమానం వచ్చింది. అదే సమయంలో షోరూమ్ రావడంతో ఆటో ఆపాలని లహరి కోరింది. అయినా ఆటో ఆపకుండా ముందుకుపోనివ్వడంతోపాటు 'నిన్ను గాజువాక తీసుకువెళతాను. అక్కడ మంచి పార్టీ ఉంది. వారికి అప్పగిస్తాను' అని చెప్పడంతో ఆందోళనకు గురైన ఆమె రైల్వే ఆస్పత్రి సమీపంలో వెళుతున్న ఆటో నుంచి కిందకు దూకేసింది. ఈ ఘటనలో బాధితురాలికి ముఖంపై గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ ఆటోను ఆపాడు. బాధితురాలు తన ఫోన్ నుంచి స్నేహితులకు ఫోన్ చేయడంతో వారంతా వచ్చి ఆమెను సమీపంలోని రైల్వే ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విమ్స్‌కు తరలించారు. ఆటో డ్రైవర్ అక్కడ నుంచి వెళ్లిపోగా, బాధితురాలి స్నేహితులు సెల్‌తో ఆటోతోపాటు డ్రైవర్ ఫొటోలు తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు దీనిపై కేసు నమోదుచేసి ఆటో డ్రైవర్ కోసం గాలించారు. గాజువాకలోని బీసీ రోడ్డుకు చెందిన శాంతికృష్ణగా గుర్తించారు. పాతగాజువాక ఆటోస్టాండ్‌లో సర్వీసు చేస్తుంటాడని టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపారు. కృష్ణను అదుపులోకి తీసుకుని విచారించామని, తాను యువతిని కిడ్నాప్ చేస్తానని అనలేదని, షోరూమ్ దాటిపోతోందని ఆమె చెప్పడంతో సడన్‌గా ఆటోను ఆపకూడదు కాబట్టి కొంచెం పక్కకు తీసి ఆపే ప్రయత్నంలో ఉండగా...ఆమె హఠాత్తుగా కిందికి దూకేసిందని చెబుతున్నాడన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

కశింకోట, ఫిబ్రవరి 27 : మండలంలోని తాళ్లపాలెం కూడలి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లపాలెం గ్రామానికి చెందిన కర్రి నూకరత్నం(43) మంగళవారం సాయంత్రం పొలంలో పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్నది. కూడలి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నది. దీంతో నూకరత్నం తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు తెలిపారు. భర్త కర్రి నూకునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

10 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కొత్తూరు, ఫిబ్రవరి 27: అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో యలమంచిలి నారాయణరావు అనే వ్యక్తి నుంచి మంగళవారం 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

విస్సన్నపేటలో...

కశింకోట: మండలంలోని విస్సన్నపేట గ్రామానికి చెందిన గొర్లి రామును అనే వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు అయన చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ప్రభుత్వ భవనాలను పట్టించుకునే వారేరి?


నాతవరంలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం (ఇన్‌సెట్‌లో) భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోతున్న దృశ్యం


శిథిలావస్థకు చేరుకున్న నాతవరం తహసీల్దార్ కార్యాలయ భవనం (ఇన్‌సెట్‌లో) భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న దృశ్యం

- శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రంథాలయ భవనం
- శ్లాబ్ పెచ్చులూడి పడుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు

నాతవరం, ఫిబ్రవరి 27: మండల కేంద్రం నాతవరంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్నాయి. శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. 1987లో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రంథాలయ భవనాలు నిర్మించారు. అప్పటి నుంచి వీటికి ఎటువంటి మరమ్మతులు చేయలేదు. ఈ భవనాలు శిథిలావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే శ్లాబ్ గుండా గదుల్లోకి నీరు వచ్చేస్తోంది. వీటి మరమ్మతులకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, అలాగే గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

'విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి'


నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి సందర్శించిన అజేయ్‌బాబు

నాతవరం, ఫిబ్రవరి 27: వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి టి.అజేయ్‌బాబు ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన నాతవరం మండలం చమ్మచింత ఎస్సీ బాలుర వసతి గృహం, నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహం, నాతవరం బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి టెన్త్ విద్యార్థుల ఆరోగ్యం బాగోకపోతే తనకు సమాచారం ఇవ్వాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహంలో స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. రికార్డులను కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ రొంగల శివ, నాతవరం బాలికల వసతి గృహం మేట్రిన్ రత్నం, చమ్మచింత వసతి గృహం వార్డెన్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మోసానికి కేరాఫ్ వైసీపీ

- తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ధ్వజం


గుడ్డు పగులగొడుతున్న అనిత

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: అన్యాయం, మోసాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల ఆమె మాట్లాడారు. దండు పాళ్యం బ్యాచ్‌తో జగన్ సిద్ధం సభలు నిర్వహిస్తున్నారన్నారు. జగన్ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. మద్యాన్ని నిషేధించి ఓట్లు అడుగుతానని చెప్పి ఇప్పుడు కొత్తగా మద్యం పాలసీ తెచ్చి నకిలీ మద్యంతో డబ్బు సంపాదిస్తున్నారన్నారు.

30 లక్షల కుటుంబాల లో చిచ్చుపెట్టారన్నారు. నకిలీ మద్యం తాగి ఎంతో మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే, రాష్ట్రానికి పోలవరం, రాజధాని హోదా, విశాఖ రైల్వే జోన్ లేకుండా సిద్ధం అంటూ సభలు ఎలా పెడుతున్నారని ఆమె ప్రశ్నించారు. విశాఖలో ప్రభుత్వ ఆస్తులు అని తాకట్టు పెట్టారన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే, ప్రజల అవయవాలను సైతం తాకట్టు పెడతారని ఎద్దేవా చేశారు.

గుడ్డు మంత్రికి టికెట్ లేదు..

కేడరే లేదు..

చేతకాని.. చేవలేని కోడిగుడ్డు మంత్రి అని ఎవరని అడిగినా ఠక్కున చెబుతారని గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి అన్నారు. ఆయన టికెట్ వీకేసిన గుడివాడకు కనీసం నియోజకవర్గం లేదని, మంత్రిగా పని చేసిన ఆయనకు పార్టీలో కనీసం చోటు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తాను తెలుగు మహిళ అధ్యక్షురాలిగా పాయకరావు పేట నుంచి పోటీ చేస్తున్నానని, గుడి వాడ ఎక్కడ నుంచి ఎన్నికల బరిలో ఉంటారో చెప్పగలరా చెప్పాలని అన్నారు. వెటకారంగా మాట్లాడితే గుడ్డు పగులుద్ది అంటూ అనిత గుడ్డు పగులగొట్టి ఆమె చూపారు.

రాక్షస పాలన నుంచి విముక్తే ధ్యేయం

సింహాచలం: రాష్ట్ర ప్రజలను రాక్షసుడి పాలన నుంచి విముక్తి చేయడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన కూటమి రానున్న ఎన్నికల్లో ఉమ్మడి వ్యూహాలతో కృషి చేస్తుందని వంగలపూడి అనిత అన్నారు. కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ఆమె సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా టీడీపీ, జనసేన నేతలు కొన్ని త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల్లో సీట్లు దక్కని వారికి అధినేతలు న్యాయం చేస్తామని ఇప్పటికే ప్రకటించారని, ఈ నేపథ్యంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు.

'ఉక్కు'లో ఉద్రిక్తత

- బయోమెట్రిక్ అమలుపై వివాదం
- తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్
- వచ్చే నెల 8వ తేదీ నుంచి అమలు చేస్తామంటూ యాజమాన్యం ఉత్తర్వులు
- పర్సనల్ డైరెక్టర్ ఛాంబర్‌లో బైఠాయించిన సంఘ నాయకులు
- అడ్మిన్ భవనం వద్ద కార్మికుల ధర్నా
- రాత్రి 12 గంటలకు కూడా కొనసాగుతున్న నిరసన కార్యక్రమం


ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ ఎస్‌సి పాండే కార్యాలయంలో నేలపై పడుకున్న ఉక్కు కార్మిక నాయకులు

ఉక్కు టౌన్‌షిప్, ఫిబ్రవరి 27: స్టీల్‌ప్లాంటులో బయోమెట్రిక్ అమలుపై వివాదం తలెత్తింది. తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే బయోమెట్రిక్ అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు మంగళవారం డైరెక్టర్ (పర్సనల్) ఛాంబర్‌లో ఆందోళనకు దిగారు. ప్లాంటులో బయోమెట్రిక్ ఏర్పాటుపై యాజమాన్యం ఈ నెల 24న కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు బయోమెట్రిక్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే కార్మికుల వేతన సవరణ, క్యాంటీన్, భద్రత పరిస్థితులు మెరుగు వంటి సమస్యలను పరిష్కరించాక అమలు చేయాలని డిమాండ్ చేశారు. అయితే నాయకుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా యాజమాన్యం మార్చి ఎనిమిది నుంచి బయోమెట్రిక్ అమలు చేస్తున్నట్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కార్మిక నాయకులు మంగళవారం సాయంత్రం అడ్మిన్ బిల్డింగ్‌లోని డైరెక్టర్ ఛాంబర్‌కు వెళ్లి బయోమెట్రిక్ అమలు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో అక్కడే బైఠాయించారు. ఈ విషయం తెలిసిన కార్మికులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో కార్మికులు అడ్మిన్ గేటు వద్ద బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. గేటు బయట, డైరెక్టర్ ఛాంబర్ వద్ద నాయకులు, కార్మికులు నిరసన కొనసాగిస్తున్నారు. 42 ఏళ్ల ఉక్కు చరిత్రలో రాత్రి సమయంలో ఉద్యోగులు/కార్మికులు ధర్నాకు దిగడం ఇదే మొదటిసారి. డైరెక్టర్ (పర్సనల్) కార్యాలయం వద్ద ఆందోళన తెలియజేస్తున్న కార్మిక నాయకులకు మద్దతుగా ఉద్యోగులు (రాత్రి 'సి' షిఫ్టునకు వెళ్లేవారు) మెరుపు ధర్నాకు దిగారు. అదేవిధంగా 'బీ' షిఫ్టునకు వెళ్లిన ఉద్యోగులు రాత్రి 10.30 గంటలకు బయటకు వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. యాజమాన్యం స్పందించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. రాత్రి 12 గంటలకు కూడా ధర్నా కొనసాగుతూనే ఉంది. ఉక్కు సీఎండీ బయటకు ఒకటి చెప్పి, మరొకటి అమలు చేస్తున్నారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, జి.గణపతిరెడ్డి, టీఎంకే నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు తప్పిన హాల్‌టికెట్ సమస్యలు

- వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని 93 కేంద్రాల్లో 82,679 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 40,873, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 41,806 మంది హాజరవుతున్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని, హాజరు చాలలేదని ఎవరూ భయపడనవసరం లేదు. పరీక్షలకు ఫీజులు చెల్లించిన ప్రతి విద్యార్థి ఈ ఏడాది పరీక్షలు రాసే అవకాశాన్ని బోర్డు కల్పించింది. ఇంటర్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల హాల్‌టికెట్లు అప్‌లోడ్ చేసింది. కళాశాలల నుంచే కాకుండా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ లేదా మరెవరి సంతకం అవసరం లేకుండా పరీక్షలు రాసేందుకు అవకాశం ఇచ్చింది. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థులైతే పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫస్ట్ ఇయర్ హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం నమోదు చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫీజులు, హాజరు సమస్యలు లేవు

ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయడానికి కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులు, హాజరు సమస్యలను తొలగించారు. విద్యార్థులు హాల్‌టికెట్లు పొందడానికి హాజరు శాతం మినహాయించింది. గతంలో సైన్స్ విద్యార్థులకు 75 శాతం, ఆర్ట్స్ విద్యార్థులకు 60శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి ఇచ్చేవారు. దీంతో జిల్లాలో ఏటా సుమారు 800 మంది పరీక్షలకు దూరమయ్యేవారు. కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు తక్కువ హాజరు ఉన్న విద్యార్థుల నుంచి అదనంగా నగదు వసూలు చేసి హాల్‌టికెట్లు ఇచ్చేవారు. ఫీజు బకాయిలు చెల్లించకపోయినా హాల్‌టికెట్లను నిలిపివేసేవారు. ఈ ఏడాది అలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరూ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు రాసేలా బోర్డు ఆదేశాలు జారీచేసిందని ఆర్‌ఐవో పి.మురళీధర్ వివరించారు.

నేటి నుంచి చెరకు రైతులకు పేమెంట్లు

- ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు

చోడవరం, ఫిబ్రవరి 27: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు ప్రస్తుత సీజన్‌కు సంబంధించిన పేమెంట్లు ఈ నెల 28 నుంచి చెల్లించనున్నట్టు ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసి అండగా నిలిచిన రైతులను ఆదుకుంటామన్నారు. డిసెంబరు 29 నుంచి జనవరి 15 వరకు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన 4,936 మంది రైతులకు తొలి విడతగా రూ.8.72 కోట్లు వారి ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే పేమెంట్లు జమ చేస్తామన్నారు. ఈ ఏడాది సీజన్‌లో సోమవారం నాటికి లక్షా 38 వేల వంద టన్నుల చెరకు క్రషింగ్ నిర్వహించి లక్షా 13 వేల క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి చేశామని పేర్కొన్నారు. రోజువారీ రికవరీ 10.01 శాతం రాగా, సగటు రికవరీ 9.04 శాతం వచ్చిందని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 12 లక్షల 16 వేల ఆరు వందల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి ఈపీడీసీఎల్‌కు విక్రయించినట్టు తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది కటింగ్ పర్మిట్లు రైతులకు నేరుగా వారి ఫోన్లకే మెసేజ్ పంపించడంతో పాటు, సకాలంలో చెరకు పర్మిట్లు వారికి అందేలా చూశామన్నారు. ఈ సీజన్‌లో సహకరించిన రైతులకు, కార్మికులకు ఎండీ సన్యాసినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట 'ఉపాధి' సిబ్బంది ఆందోళన

- సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట పడతామని హెచ్చరిక


డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 27: తమ సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి జి.రవిచంద్ర మాట్లాడుతూ.. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమకు గ్రేడ్‌లు, కేడర్ ఫిక్స్ చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పీఆర్సీ అమలు చేయాలని, ఎఫ్‌టీఈ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ దయానిధిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి కొండాజీ, శివానీ, దేవకి, సతీశ్‌కుమార్, శ్రీను, దశరథ్ రామరాజేశ్ పాల్గొన్నారు.

33 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక


సీతపాలెం తీరంలో కలుసుకున్న అచ్యుతాపురం హైస్కూల్ 1990-91 టెన్త్ బ్యాచ్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 27: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదవ తరగతి చదువుకున్న వారిలో పలువురు మంగళవారం రాంబిల్లి మండలం సీతపాలెం బీచ్‌లో ఆత్మీయంగా కలిశారు. వీరిలో ఒకరైన పూడిమడక మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు అందరిని సమన్వయపరిచి, 33 ఏళ్ల తరువాత ఒకచోట కలిసేలా కృషి చేశారు. ఎవరెక్కడ వుంటున్నారు, ఏం చేస్తున్నారో తెలుసుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. హైస్కూల్‌లో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఏటా ఒకసారి తప్పనిసరిగా కలుసుకోవాలని తీర్మానించుకున్నారు.

కేజీబీవీలో జీసీడీవో రాత్రి బస


సోమవారం రాత్రి స్టడీ అవర్‌లో విద్యార్థినులతో జీసీడీవో పద్మావతి

కోటవురట్ల, ఫిబ్రవరి 27: జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి (జీసీడీవో) పద్మావతి సోమవారం రాత్రి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించారు. విద్యార్థినుల కోసం వండిన భోజన పదార్థాలను రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో సరుకులు, రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. పరీక్షల సమయంలో ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా వుండాలని సూచించారు. సోమవారం రాత్రి విద్యాలయం ప్రత్యేక అధికారిణి సరితాదేవి, విద్యార్థినులతో కలిసి వసతిగృహంలో బసచేశారు. మంగళవారం ఉదయం యోగా తరగతులను పరిశీలించారు. స్టడీ అవర్‌లో పదో తరగతి పాఠ్యాంశాలకు సంబంధించి బాలికల సందేహాలను నివృత్తి చేశారు.

నేడు రైతు భరోసా, పీఎం కిసాన్ సాయం విడుదల

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 27: రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ఐదో సంవత్సరం మూడో విడత సాయం, పంట రుణాలపై సున్నా వడ్డీ రాయితీ సొమ్మును ప్రభుత్వం బుధవారం విడుదల చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం జిల్లాలో అర్హులైన 2,65,886 మంది రైతులకు రూ.53.32 కోట్లు, సున్నావడ్డీ రాయితీ కింద రూ.6.9 కోట్లు ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని పేర్కొన్నారు.



డీఐవో సాధనకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు

రెగ్యులర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

» వైద్య ఉద్యోగుల ప్రత్యేక స్పందనలో డీఐవోకు వినతి

పాడేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తమను రెగ్యులర్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైద్య ఉద్యోగుల ప్రత్యేక స్పందనలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ సాధనకు వినతిపత్రం సమర్పించారు. వైద్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు వంద శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని, పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించాలని, సాధారణ బదిలీలు పక్కాగా జరగాలని, ఏఎన్‌ఎంలకు హెచ్‌వీలుగా పదోన్నతులు కల్పించాలని, గిరిజన ప్రాంతంలో ఎఫ్ఆర్ఎస్‌లో వెసులుబాటు, ఏఎన్‌ఎంలకు యాప్‌ల భారం తగ్గించాలని, ఆశా కార్యకర్తల నియమాకాలు చేపట్టాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు శెట్టి నాగరాజు, నాయకులు వి.శంకరరావు, ఎస్.బాలయ్య, కె.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవో నేతల వినతి

వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీఎన్‌జీవో డివిజన్ కార్యదర్శి ఎస్.సంజీవరాజు ఆధ్వర్యంలోనూ డీఐవో డాక్టర్ సాధనకు వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా వైద్య సిబ్బందికి యాప్‌ల భారం తగ్గించాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

వర్క్‌గుమ్మిలో 'బాబు ష్యూరిటీ'



వర్క్‌గుమ్మిలో ప్రచారం చేపడుతున్న టీడీపీ నేత బలరాం, తదితరులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 27: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ వర్క్‌గుమ్మి గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో బలరాం ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఇంటింటీ వెళ్లి టీడీపీ ఆరు గ్యారెంటీ పథకాలను గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ బాబుతోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వైసీపీ నిరంకుశ పాలనకు చరమ గీతం పాడి గిరిజన గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమంటూ గళమెత్తి ఎన్నికల్లో టీడీపీని అధికారంలో తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సుబ్బారావు, భాస్కరరావు, ఆనందరావు, బుద్దు, శంకరరావు, వెంకటరావు, బొంజుబాబు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

నిజం గెలువాలి సభను విజయవంతం చేయాలి

జి.మాడుగుల, ఫిబ్రవరి 27: టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేపట్టే నిజం గెలువాలి కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ మంత్రి మణికుమారి, టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు పిలపునిచ్చారు. ఈ మేరకు మండలంలో మంగళవారం వారు పర్యటించి భువనేశ్వరి పర్యటనను ఉద్దేశించి స్థానిక నేతలతో చర్చించారు. సుదీర్ఘ రాజకీయ చరిత్రలో గిరిజన ప్రాంతంలో మృతి చెందిన కుటుంబాలకు ఆదుకున్న ఏకైక పార్టీ టీడీపేనని అన్నారు. ఈ మేరకు ఆ కుటుంబాలకు ఓదార్చి, ఆర్థికంగా ఆదుకోవడం గొప్పవిషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగబ్బాయి, మత్స్యరాజు శివ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరుకండి

» ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేకాధికారి వినోద్‌బాబు



థింసా నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థిని విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ఆత్మస్థైర్యంతో హాజరుకావాలని జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేకాధికారి వినోద్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరీక్ష అంటే కొంత భయం ఉండడం సహజమేనని, అయితే ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. కొద్ది రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా చక్కగా సిద్ధం కావాలని చెప్పారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకమని, బాగా చదివి మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివేందుకు, ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఆస్కారంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కళాశాల వసతి గృహ అధికారి రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు గీత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మన్యంలో నిజం గెలవాలి

... 5వ పేజీ తరువాయి



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళా నాయకులు

కుటుంబాన్ని పరామర్శించి, వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఇక్కడి నుంచి నేరుగా నర్సీపట్నం చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

ప్రత్యేకంగా చలువ పందిరి ఏర్పాటు



చలువ పందిరిపై వేసేందుకు ఉంచిన ఈత గడ్డి

మన్యంలో 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వస్తున్న నారా భువనేశ్వరి అరకులోయ పర్యటన అనంతరం పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామంలో టీడీపీ శ్రేణులతో సమావేశం కానున్నారు. దీని కోసం ప్రత్యేకంగా చలువ పందిరి వేస్తున్నారు. సాధారణంగా షామియాలు వేసి అందులోనే సమావేశాలు నిర్వహిస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా సహజసిద్ధమైన వాటితోనే చలువ పందిరి వేస్తున్నారు. అయా ఏర్పాట్లను టీడీపీ స్థానిక ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కర్రలతోనే పందిరి వేసి, కొండల్లో లభించే ఈత గడ్డినే దానికి పైన వేస్తున్నారు. దీంతో ఎంత ఎండ కాసినా కిందన వున్న వాళ్లకు చల్లగానే ఉంటుంది. నారా భువనేశ్వరి సూచన మేరకు చలువ పందిరిని ఏర్పాటు చేస్తున్నామని గిడ్డి ఈశ్వరి తెలిపారు.

సమస్యలపై స్పందించరేం..?

» అధికారులపై ఎంపీపీ కొర్రా పద్మ మండిపాటు

» సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

» గ్రామాల్లో పెరిగిపోతున్న డ్రాపౌట్లు

» జి.మాడుగుల మండల సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

జి.మాడుగుల, ఫిబ్రవరి 27: సమస్యలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఎంపీపీ కొర్రా పద్మ మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయాపాలన పాటించలేదని, ఫలితంగానే డ్రాపౌట్లు పెరిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు వైద్యాధికారి శశికాంత్ మాట్లాడుతూ గ్రామాల్లో శిశు మరణాలు అరికట్టేందుకు ప్రజా ప్రతినిధులు సహకారించాలని కోరారు. అలాగే సికిల్ సెల్ ఎనీమియాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కొండబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పని దినాలు పెంచుకోవాలని సూచించారు. బొయితిలి, కిల్లంకోట పంచాయతీ పరిధి గ్రామాల్లో ఉపాధి పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస బాట పట్టారని బొయితిలి సర్పంచ్ మాలన్న ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఏఈ వెంకటరమణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పీవీటీజీ కుటుంబాలకు 1,748 ఉచిత విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్ అధికారి దేముడు మాట్లాడుతూ నిధుల కొరత వల్ల నాడు-నేడు పనులు జాప్యం జరుగుతున్నట్టు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అప్పలస్వామి మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించుకోవాలని సభ్యులకు సూచించారు. గత సర్వసభ్య సమావేశాల్లో ఉపాధ్యాయుల తీరుపై ప్రస్తావించినప్పటికీ నేటికి ఎందుకు చర్యలు చేపట్టలేదని విద్యా శాఖ అధికారులకు లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర ప్రశ్నించారు. కాగా, వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి ఎద్దడి తీవ్రంగానే ఉన్నప్పటికీ, దానిపై సభ్యులు కనీసం స్పందించకపోడం విశేషం. ఈ సమావేశంలో ఎంపీడీవో లోహిత్ జయసాగ్, ఏపీఎం సుందరమ్మ, హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, కల్యాణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాతృ భాషా వలంటీర్లను రెన్యువల్ చేయండి

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



వలంటీర్లకు మద్దతుగా దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 27: ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లను తక్షణమే రెన్యువల్ చేయాలని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి డిమాండ్ చేశారు. విద్యా వలంటీర్లను ఈ నెల 29 వరకే కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడంతో మార్చి, ఏప్రిల్ నెలలో కూడా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వలంటీర్లు ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా సోమవారం ఉదయం 24 గంటల దీక్షలను చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న గిడ్డి ఈశ్వరి మంగళవారం శిబిరాన్ని సందర్శించి వలంటీర్లకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యంలో మాతృ భాషా ద్వారా ప్రాథమిక విద్యను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్న వలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలలో కొనసాగించడంతో పాటు 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ఓపెనింగ్ రోజు నుంచే విధుల్లో కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ మాతృ భాషా వలంటీర్ల సమస్యలపై ఇప్పటికే అనేక సార్లు ఆందోళనలు చేపట్టామని, అధికారులకు వినతులు అందించామని, అయినా ఫలితం లేకపోవడంతో 24 గంటల దీక్షలకు దిగామని చెప్పారు. ఈ పోరాటాన్ని ఇంతటితో ఆపేది లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన మంగళవారం మధ్యాహ్నం వలంటీర్లకు నిమ్మరసం అందించి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చిన్నయ్యపడాల్, లక్కు, సుందరరావు, వలంటీర్ల సంఘం నాయకులు కొర్రా శ్రీను, చంద్రయ్య, సత్తిబాబు, చంద్రమ్మ, చిన్నమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలి

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత



గిరిజన పూజారులకు పూజా సామగ్రి అందిస్తున్న కొత్తపల్లి గీత

గూడెంకొత్తవీధి/కొయ్యూరు, ఏప్రిల్ 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆదివాసీలు వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలని మాజీ ఎంపీ కొత్తపల్లి గీత పిలుపునిచ్చారు. గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రజా పోరు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను జగన్‌రెడ్డి పేర్లు మార్చుకుని తన చిత్రం స్టిక్కర్లు అతించుకుని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పక్కా గృహాలన్నీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, రాష్ట్రం వాటా ఏమీ లేదని చెప్పారు. ఇంటింటికి కొళాయిలు వేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకం కేంద్రానిదేనన్నారు. రాష్ట్రంలో 60 శాతం పథకాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేవే కొనసాగుతున్నాయన్నారు. పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం జగన్మోహన్‌రెడ్డి దారిమళ్లించాడన్నారు. దీంతో పంచాయతీ కేంద్రాల్లో నిధులులేక అభివృద్ధి కుంటుబడిపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఆదివాసీలు పెట్టుకున్న నమ్మకంపై జగన్ దెబ్బతీశారన్నారు. మళ్లీ వైసీపీ ఓటు వేస్తే రాష్ట్రం సర్వ నాశనమైపోతుందని, గిరిజనుల అభివృద్ధి, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆమె స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చైతన్యంతో ఓటు వేయాలన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే బీజేపీకు అధికారం చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు, నాయకులు శేఖర్, త్రినాథ్, రామ్ కిరణ్ కుమార్, లక్ష్మణరావు, చిన్నబ్బాయి, సాగిన బాలకృష్ణ, గెంగి బాలరాజు, పొటుకూరి శ్రీను, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజు, అసెంబ్లీ సోషల్ మీడియా పండ ఈశ్వరరావు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గాలి దేముడు, చింతపల్లి మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, వీహెచ్‌పీ ప్రచారక్ డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

రహదారికిరువైపులా దుకాణాలు పెట్టొద్దు



వర్తకులకు షెడ్ల కేటాయింపునకు నంబర్లు వేస్తున్న దృశ్యం

చింతపల్లి, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని బుధవారం జరిగే వారపు సంతలో రహదారికిరువైపులా వర్తకులు దుకాణాలు పెట్టకూడదని మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత సూచించారు. రూ.20 లక్షల నాబార్డు, పంచాయతీ నిధులతో నిర్మించిన సంత షెడ్లు, ఖాళీ స్థలాన్ని లాటరీ పద్ధతిలో మంగళవారం వర్తకులు కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంత కోసం కేటాయించిన 40 షెడ్లు, మరో 50 ఖాళీ స్థలాలు వర్తకులకు కేటాయించామన్నారు. సంత షెడ్లు కూరగాయల వ్యాపారులకు కేటాయించామన్నారు. ఖాళీ స్థలం చేపలు, మాంసాహారం, దుస్తులు, కిరాణ, ఫ్యాన్సీ, చెప్పులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర వ్యాపారులకు కేటాయించామన్నారు. రహదారికిరువైపులా దుకాణాలు పెడితే ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నదని, ఇకపై అలాగే చేస్తే పోలీసుల సహకారంతో తొలగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నేత హేమంత్, వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్వరరావు, పంచాయతీ గుమస్తా అంబేడ్కర్, వర్తకులు పాల్గొన్నారు.

కూలీలకు వంద రోజుల పని కల్పించండి

» ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 27: ఉపాధి హామీ పథకం కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ రోజు పది వేల మంది కూలీలు పనులకు హాజరుకావాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం మండలంలో ఏడు వేల మంది కూలీలు పనులు చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయి ఉద్యోగులు గ్రామ స్థాయిలో పనులను గుర్తించాలని, స్థానికంగానే కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. అలాగే దినసరి కూలి రూ.257కి పైగా తీసుకునేలా ఎఫ్ఏ, టీఏలు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధి హామి పథకం ద్వారా చేపడుతున్న ఉద్యాన పంటల సాగును పర్యవేక్షించాలన్నారు. కూలీల జాబ్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో రాంప్రసాద్ పాల్గొన్నారు.

టెట్‌కు తొలి రోజు 86.8 శాతం హాజరు



విశాఖలోని చినముషిడివాడ ఐయాన్ టెక్నాలజీస్ కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. మంగళవారం నగరంలోని ఏడు కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. తొలిరోజు పరీక్షకు 4,420 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా..3837 (86.8 శాతం) మంది హాజరయ్యారు. 583 మంది మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ పలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

ననబారి ఘాట్ రోడ్డులో జీపు బోల్తా



ఘాట్ రోడ్డులో బోల్తా కొట్టిన జీపు

పెదబయలు, ఫిబ్రవరి 27: మండలంలోని ననబారి ఘాట్ రోడ్డులో మంగళవారం అదుపు తప్పి ఓ జీపు బోల్తా పడింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిగురవు నుంచి ననబారి వరకు వెళ్లిన సర్వీసు జీపు, అక్కడ ప్రయాణికులకు దింపి తిరుగు ప్రయాణమైంది. ననబారి సమీపంలోని ఘాట్ రోడ్డులో బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో జీపు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ త్రుటిలో తప్పించుకున్నాడు. అదృష్టవశాత్తు ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

రుణ మంజూరుతో ఆర్థికాభివృద్ధికి తోడ్పడండి

జి.మాడుగుల, ఫిబ్రవరి 27: మండలంలోని మహిళలకు రుణాలు మంజూరు చేసి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కేబీ ఫౌండేషన్ మండల కో-ఆర్డినేటర్ ఎల్.రాజన్నదొర కోరారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్లు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన మహిళలకు రుణాలు అందిస్తే వారు ఆర్థికంగా ముందుకు సాగే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో సందర్శించి ఫౌండేషన్ చేపట్టే వివిధ సేవ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్లు ఎల్.బాలయ్యదొర, పి.శ్రీనివాస్, సింహాచలం, కె.శ్రీనుబాబు, జి.రావణకుమారి, రత్నకుమారి, రాజులమ్మ, రవికుమార్ తదితరలు పాల్గొన్నారు.

కించుమండలో పారిశుధ్య పనులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 27: మండలంలోని కించుమండ పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ చెల్లమ్మ పర్యవేక్షణలో మురుగు కాలువల శుభ్రత పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపడుతున్నామని చెప్పారు. వ్యాధుల నియంత్రణకు డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారాలను తొలగిస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాదులు దరిచేరని ఆమె చెప్పారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారాల శుభ్రతకు గిరిజనులు తోడ్పాటును అందించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

పాత కాఫీ తోటల్లో పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలి: జేఎల్‌వో ప్రదీప్

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 27: రైతులు పాత కాఫీ తోటల్లో పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని కాఫీ బోర్డు జూనియర్ లైజనింగ్ అధికారి (జేఎల్‌వో) ఎస్.ప్రదీప్ చెప్పారు. మండలంలోని మంగళపాలెం గ్రామంలో మంగళవారం కాఫీ యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కాఫీ తోటల్లో దిగుబడులు పెంపునకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తోటల్లో తగినంత నీడ ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. రైతులందరూ కాఫీ తోటల్లోని మొక్కల పైభాగంలో వచ్చే పిలకలను, కలుపు మొక్కలను తొలగించుకోవాలన్నారు. వేసవి ప్రారంభం కావడంతో అగ్ని ప్రమాదాలకు గురికాకుండా ఫైర్ లైన్ క్లియరెన్స్ పనులు చేపట్టుకోవాలన్నారు. ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

భువనేశ్వరి సభకు తరలిరండి

హుకుంపేట, ఫిబ్రవరి 27: టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి మన్యం పర్యటనకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు కొర్రా తులసిరావు పిలుపునిచ్చారు. మంశవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అరకు నుంచి డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల మీదుగా వస్తున్న భువనేశ్వరికి ప్రతీ మండల కేంద్రంలో ఘన స్వాగతం పలకాలని కోరారు.

జీవో-3 అమలు చేయాలని నిరసన

హుకుంపేట, ఫిబ్రవరి 27: గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన జీవో నంబర్-3ను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆదివాసీ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాడేరు-అరకు ప్రధాన రహదారిలోని ఒంటిపాక వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డీటీఎస్ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి ధర్మేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రత్యేక జీవో అమలుచేసి గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో జీవో-3ను తక్షణమే పునరుద్ధరించాలని డిమాడ్ చేశారు. ఈ సమస్యలపై అందరూ పోరాడాలని, గ్రామాలకు వచ్చే నాయకులను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు భాగ్యరాజు, మోహన్ రావు, ప్రేమ్‌కుమార్, తిరుపతి, సాగరి కిరణ్ పాల్గొన్నారు

కొమ్మికలో 300 మందికి వైద్య సేవలు

కొయ్యూరు, ఫిబ్రవరి 27: కొమ్మిక కేంద్రంగా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మందికి సేవలు అందించినట్టు వైద్యాధికారి సుధా శారద తెలిపారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక, సీజనల్ వ్యాధుల బారిన పడిన వారితో పాటు విద్యార్థులకు ఆరోగ్య తనిఖీ నిర్వహించి మందులు అందించామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, కార్యదర్శి ఆర్‌పీ నాయుడు, కంఠారం పీహెచ్‌సీ సిబ్బంది ప్రసాద్, చందన, భాగ్యలక్ష్మి, రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో రహదారి సదుపాయం కల్పించడమే లక్ష్యం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 27: మారుమూల గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ అన్నారు. మండలంలోని గసభ రోడ్డు జంక్షన్ నుంచి సిమిలిగుడ మీదుగా సిరసగుడ వరకు రూ.65 లక్షలతో మంజూరైన గ్రావెల్ రోడ్డుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమిలిగుడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని నెల రోజుల క్రితం గ్రామస్థులు ఎమ్మెల్యే ఫాల్గుణ దృష్టికి తీసుకెళ్లగా, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ వచ్చి నెరవేర్చారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో సిమిలిగుడ, సిరసగుడ గ్రామస్థులకు రవాణా కష్టాలు తీరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, ఎంపీటీసీ సభ్యులు జెమ్మా, సర్పంచ్ నాగేశ్వరరావు, నాయకులు సింహాచలం, కృష్ణారావు, సునీల్, నర్సింగరావు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 27: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస జీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడు బస్కిబారికి లాలుకు మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. ఉద్యోగ విరమణ సందర్భంగా గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు సేవలందించి, వారి విద్యాభివృద్ధికి లాలు తోడ్పాటును అందించారని చెప్పారు. విరమణ తర్వాత కుటుంబ సమేతంగా హాయిగా జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాపారావు, రమేష్, నూకరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

3200 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 27: మండలంలోని కండ్రుం పంచాయతీ రాయ్‌పాడు గ్రామంలో నాటుసారా బట్టీలపై మంగళవారం పోలీసులు విస్తృత దాడులను నిర్వహించారు. ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎస్ఈబీ, ఒడిశా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన దాడుల్లో సారా తయారీకి నిల్వ చేసిన 3200 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో నాటుసారా కేంద్రాలపై దాడులు నిర్వహించి, సారా నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నాటుసారా తయారీతో పాటు విక్రయాలు సాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో నాటుసారా నిర్మూలనతోపాటు గంజాయి రవాణా అడ్డుకట్టకు పక్కాగా చర్యలు చేపట్టాని ఆయన తెలిపారు.

విద్యార్థికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి

జి.మాడుగుల, ఫిబ్రవరి 27: మండలంలోని కొత్తూరు బాలురు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పాంగి శ్రీనుకు సికిల్‌ఎల్ ఎనీమియా వ్యాధి సోకింది. దీంతో పాఠశాల సిబ్బంది మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థికి పరీక్షలు నిర్వహించి, ఇక్కడి నుంచి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే ఏటీడబ్ల్యూవో తిరుపాల్ మంగళవారంఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించి, వైద్య సేవలపై ఆరా తీశారు.

ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా డీవీ సూర్యనారాయణరాజు

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డీవీ సూర్యనారాయణరాజుకు పూలమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసీపీ శ్రేణులు

కోటవురట్ల, ఫిబ్రవరి 27: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఏపీ ఎంఎస్ఎంఈ) చైర్మన్‌గా డీవీ సూర్యనారాయణరాజు నిమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తంగేడు రాజుల కుటుంబానికి చెందిన సూర్యనారా యణరాజు గతంలో శాసన మండలి సభ్యుడిగా పనిచేశారు. కాగా ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సూర్యనారాయణరాజు నియమితులైన విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు సిద్దాబత్తుల నాగేశ్వరరావు, చామంతుల శ్రీనివాసరావు, కోటవురట్ల సర్పంచ్ అనిల్‌కుమార్, గొట్టివాడ సర్పంచ్ రమేష్, తదితరులు తంగేడులో ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.